

# దొంగగది

-కొమ్మూరి రవికిరణ్

దిగులుగా ఏదో ఆలోచిస్తూ, సోఫాలో పడుకుని వున్నాడు పదేళ్ళ రాంబాబు. వాడి వయసు పదేళ్ళయినా, మనసు మాత్రం వాడికన్నా కొంచెం పెద్దది.

ఇంట్లో వాడొక్కడే వున్నాడు. తండ్రి ఆఫీసుకి వెళ్ళాడు. తల్లి 'స్నేహితురాలి యింటికి' అని చెప్పి వెళ్ళింది. స్కూలుకు శలవులు కాబట్టి రాంబాబు మాత్రం యింట్లో వుండిపోయాడు.

ఇప్పుడు వాడు ఆలోచిస్తున్నది. ఈ మధ్య తన తల్లిదండ్రులు తనతో సరిగ్గా వుండటం లేదు. సరిగ్గా వుండటం లేదంటే వాడి వుద్దేశ్యం తల్లి దండ్రులు తనతో ప్రేమగా మాట్లాడటం లేదు. ఇది వరకులా ఆప్యాయంగా దగ్గరకు తీసుకోవడం లేదు. ఇది వరకైతే స్కూలు నుంచి కొంచెం ఆలస్యంగా వస్తే కంగారు పడిపోయి, స్కూలుకి ఆదరాబాదరగా వచ్చేవాళ్ళు.

ఇప్పుడలాకాదు. తను ఎన్నింటికి వచ్చినా పెద్దగా పట్టించుకోవడం లేదు. ఎప్పుడూ లేనిది తనని ఒకడ్నే యింట్లో వదేసి వెళ్ళిపోతున్నారు. కారణం ఏమిటో వాడి ఊహకందని ప్రశ్న అయిపోయింది. ఎన్ని విధాలుగా ఆలోచించినా వాడి పసిమనసుకి సమాధానం దొరకటం లేదు.

అప్రయత్నంగా వాడి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. డైనింగ్ టేబుల్ వంక చూశాడు. తను వచ్చేసరికి ఆలస్యం అవుతుంది, ఆకలేస్తే పెట్టుకుని తినమని చెప్పి వెళ్ళింది తల్లి. వాడికిప్పుడు ఆకలేస్తోంది. అంతలో రోషం ముంచుకు వచ్చేసింది. తల్లి తనతో మళ్ళీ యిదివరకులా దగ్గర కూర్చోబెట్టి తినిపించేంత వరకూ తను అన్నం తినకూడదని గట్టిగా నిర్ణయించుకున్నాడు.

ఇంతలో తలుపు చప్పుడయింది. కళ్ళు తుడుచుకుని లేచి వెళ్ళి తలుపు తీసాడు. ఎదురుగా ఎదురింటి ఎనిమిదేళ్ళ పాప వింధ్య నిలబడి వుంది.

వింధ్యని చూడగానే రాంబాబుకి సంతోషం కలిగింది. ఈ మధ్య తల్లి దండ్రులు వాడితో ముభావంగా వుండటం చేత వింధ్య రాంబాబుకి దగ్గరైంది.

వింధ్య లోపలికి వస్తూ అంది ఆరిందల్లాగా ''ఇంట్లో ఎవరూ లేరా?''

లేరన్నట్టు తలవూపాడు రాంబాబు.

''నవ్వొక్కడివే ఏం చేస్తున్నావ్''?

''ఆలోచిస్తున్నా'' అన్నాడు రాంబాబు.

''ఏం ఆలోచిస్తున్నావ్''

''ఏదోలే''చెప్పడంయిష్టం లేనట్టుముఖం పెట్టాడు.

''సరేలే'' దొంగ పోలీసు ఆట ఆడుకుందామా'' అంది. వెంటనే సంతోషంతో విప్పారిన నేత్రాలతో తలవూపాడు. రాంబాబు. వాడికి యిష్టం అయిన ఆటల్లో యిది ఒకటి. ఇదివరకు తల్లితో ఆడేవాడు, ఇప్పుడు తల్లి దూరంగా వుంటోంది కాబట్టి వింధ్యతోనే ఆడుతున్నాడు.

తాత్కాలికంగా వాడు ఆకలిని మర్చిపోయాడు.

ఇద్దరూఅరగంట సేపు ఆడారు.రాంబాబు అన్నాడు. ''ఈసారి నేను దొంగ, నువ్వు పోలీసు నేనెక్కడ వున్నదో నవ్వు కనుక్కోవాలి'' అన్నాడు.

''సరే ......''

ఆ ఇంట్లో ప్రతి అంగుళం తెలుసు వింధ్యకి. రాంబాబు ఎక్కడ వున్నా ఇట్టే కనిపెట్టేస్తుంది. ఈసారి ఎలాగైనా వింధ్యకి దొరక కూడదని,

అటు... ఇటు చూసాడు. బెడ్ రూమ్ తలుపు తీసుకుని చిన్న సందులా వుంది. అక్కడికి వచ్చాడు. అక్కడ పాత సామాన్లు అన్నీ పెట్టారు. సామాన్ల వెనక క్రిందకి వెళ్ళే దారి సొరంగంలా మెట్లు వున్నాయి. అది పూర్వకాలపు యిల్లు కాబట్టి అక్కడ మెట్లు కట్టించారు. అది ఈ కాలంలో అసహ్యంగా వుంటుందని ఆ మెట్లు చివర్న అడ్డుగా గోడ కట్టించేసాడు రాంబాబు తండ్రి.


పాత సామాన్లని దాటి ఆ మెట్ల దగ్గరకు వెళ్ళాడు రాంబాబు. తల్లి ఎప్పుడూ అటువైపు అసలు వెళ్ళద్దంటుంది. కాని యిప్పుడు తల్లి మీద కోపంగా వున్నాడేమో మొండిగా మెట్లుదిగి గోడను చేరుకుని అక్కడ కూర్చున్నాడు. అది ఒక గుహలా వుంది. అక్కడ కూర్చుంటే వింధ్య తనని కనిపెట్టలేదని అక్కడే కాస్సేపు కూర్చుండిపోయాడు.

పది నిమిషాలు గడిచిపోయాయి. ఇక వింధ్య తనని కని పెట్టలేదని లేవబోయాడు...

వున్నట్టుండి కిలకిలా నవ్వు వినిపించింది.

ఒక మగగొంతు, ఒక ఆడగొంతు.

కంగారు పడిపోయి చుట్టూ చూసాడు. ఎక్కడా




ఏమీ కనబడలేదు.

మళ్ళీ నవ్వులు.

ఈ సారి జాగ్రత్తగా గమనించాడు. అక్కడ ఒక రేకుముక్క గోడలో కలిసిపోయినట్టుగా వుంది. ఆరేకుకి అక్కడక్కడా చిల్లులు వున్నాయి. ఆ నవ్వులు ఆ రేకులోంచివినపడుతున్నాయని గ్రహించిమెల్లగా చప్పుడు చేయకుండా జరిగి ఒక చిల్లులోంచి చూసాడు అంతే...

లోపల ఏం దృశ్యం చూసాడో తెలియదు కాని పదేళ్ళ రాంబాబు కళ్ళు ముందు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి, తర్వాత క్రమంగా ఎరుపురంగుకు సంతరించుకున్నాయి.

లోపల......

అదిఒక చిన్నగది. అక్కడ రాంబాబుతల్లి అర్ధనగ్నంగా పడుకుని వుంది, ప్రక్కన మరో యువకుడు పడు కున్నాడు. అతని చెయ్యి రాంబాబు తల్లి గుండెల మీద వుంది.

ఆ దృశ్యం రాంబాబు చూస్తున్నాడు.

రాంబాబు తల్లి అంటోంది "అబ్బ... మళ్ళీ ఎన్నాళ్ళకి సురేష్. అప్పుడు నా పెళ్ళి కాకముందు, మళ్ళీ యిప్పుడు పెళ్ళైన తర్వాత అయినా నువ్వు ఏం మారలేదు అంది" నవ్వుతూ.

"నువ్వు మటుకు. పదేళ్ళ కొడుకున్నా అప్పటిలాగే వున్నావ్. నీ అందాలు ఏం మారలేదు. అసలు నిజం చెప్పాలంటే అప్పటి కంటే యిప్పుడే నీ అందం రెట్టింపయ్యింది.

అన్నీ... ఒట్టి... కబుర్లే అంది కిలకిలా నవ్వుతూ రాంబాబు తల్లి. ఆ కబుర్లు నిజం చేయడానికి ముందుకి జరిగాడు సురేష్.

ఇకఆ దృశ్యం చూడలేకపోయాడురాంబాబు. వాడికి తెలిసినంత వరకు తల్లి ప్రక్కన తన తండ్రి పడు కోవటమే తెలుసు.

ఎప్పుడో అర్ధరాత్రి లేచేవాడు. తన తల్లి, తండ్రి ఒకళ్ళ మీద ఒకళ్ళు పడుకుని వుండటం చూసేవాడు. అదోరకమైన ఆట అనుకునేవాడు.

కానీ......

ఇప్పుడు అదే ఆట యింకొకరితో ఆడుతోంది. ఈ విషయం తండ్రికి చెప్పాలి.

జరుగుతున్న విషయం చూసిన తర్వాత ఆ పసి మనసు చాలా బాధపడింది.

తల్లంటేఅసహ్యమేసింది. తల్లినిచంపేద్దాం అన్నంత కోపం వచ్చింది.

కోపం, ఏడుపు, ఉక్రోషం అన్నీ మిళితమౌతుండగా లేచి నిలబడ్డాడు.

"దొంగ..." అని వినబడింది.

తలెత్తి చూసాడు. వింధ్య నవ్వుతూ అంటోంది. "దొంగదొరికిపోయాడు... దొంగదొరికిపోయాడు" అని-

అవును వాడు దొరికి పోయాడు. కాని వాడికి అసలు దొంగలు దొరికిపోయారు.

మెల్లగా పైకి వచ్చేసాడు రాంబాబు.

* * * * *

తలుపు తీసుకుని లోపలికి వచ్చింది రాంబాబు తల్లి.

ఇంకా సోఫాలో అలాగే పడుకున్న కొడుకుని చూసి అడిగింది. "భోంచేశావా"?

తలవూపాడు రాంబాబు.

లోపలికి వెళ్ళి బట్టలు మార్చుకుని మళ్ళీ వచ్చింది. తల్లి ముఖం చూశాడు రాంబాబు. మామూలుగానే వుంది. "రాక్షసీ" అనుకున్నాడు కసిగా. అంతకన్నా పెద్దపదం తెలియట్లేదు వాడికి. తల్లిని తిట్టడానికి.

సాయంకాలం తండ్రి రాగానే చెబుదామనుకున్నాడు. కాని తల్లి ప్రక్కనే వుంది.

ఊహు ఇది కాదు సమయం. తండ్రికి యిలా చెప్పకూడదు. స్వయంగా చూపించాలి.

తండ్రితో మామూలుగానే నవ్వుతూ మాట్లాడు తున్న తల్లిని చూసి కోపంతో హృదయం భగ్గుమంది.

ఎంత నటన......

ఆ రాత్రి అన్నం విషం మింగినట్లు తిని నిద్ర పోయాడు రాంబాబు.

సగం రాత్రిఅయ్యేసరికి మెలుకువవచ్చింది. ప్రక్కకి చూశాడు. నిద్రలో తల్లి ఒక చెయ్యి వాడి మీద వేసి పడుకుంది. వాడికి జెర్రెలు ప్రాకినట్టైంది.

నెమ్మదిగా చెయ్యి తొలగించి తండ్రివైపు తిరిగి పడుకున్నాడు రాంబాబు.

* * * * *

మర్నాడు,

"నాన్నా"...అని పిలిచాడు రాంబాబు.

"ఊ"... అన్నాడు రాంబాబు తండ్రి.

"నువ్వు యివ్వాళ ఆఫీసు మానేసేయ్."

ఆశ్చర్యంగా చూశాడు కొడుకు వంక.

"ఎందుకని..."

ఏం మాట్లాడలేదు రాంబాబు.

"ఏమైనా కొనుక్కోవాలా?"

"......"

"చెప్పు... ఏమైనా కావాలంటే అమ్మను అడుగు తెచ్చిపెడుతుంది." అని వెళ్ళిపోయాడు తండ్రి.

ఏడుపు వచ్చింది రాంబాబుకి.

కాస్సేపు అయిన తరువాత షాపింగ్ అని చెప్పి వెళ్ళిపోయింది రాంబాబు తల్లి.

మళ్ళీ ఒంటరి వాడైపోయాడు.

పదకొండయింది.

మెల్లగా లేచాడు రాంబాబు. బెడ్‌రూమ్ తలుపు తెరచి మెట్లుదిగి నిన్న చూసిన ప్రదేశానికి వెళ్ళాడు.

లోపల్నుంచి నవ్వులు వినపడ్డాయి.

రేకు చిల్లులోంచి లోపలికి చూసి శిలా ప్రతిమ అయిపోయాడు.

లోపల వుంది వాడి తల్లికాదు, వేరే యువతి. ఆమె ప్రక్కన వుంది తన తండ్రి.

ఒక్కసారిపిచ్చిపట్టినట్లయిందిపసివాడు రాంబాబుకి.

లోపల రాంబాబుకి తండ్రి ప్రక్కనున్న యువతి అంటోంది.

"ఇప్పుడు మీ ఆవిడ చూసిందంటే" అని సందేహం వెళ్ళబుచ్చింది.

"మా ఆవిడకే కాదు. ఆ దేవుడికి కూడా తెలియదు యిక్కడ గదివున్నట్టు. మనకోసమేకట్టించాను" అన్నాడు రాంబాబు తండ్రి.

తల్లి దండ్రులు తనతో ఎందుకు సరిగ్గా వుండటం లేదో అర్థం అయింది వాడికి.

ఏదైనా తప్పు చేస్తే తనతో చెప్పమనేవాడు తండ్రి. అలాంటి తండ్రే తప్పుచేస్తే ఎవ్వరికి చెప్పాలో?

వాడిలో ఎన్ని అగ్ని పర్వతాలు బద్దలు అవు తున్నాయో తెలియదు కాని,

బయటకు మాత్రం...

ముందు ఉద్విగ్నత...

తర్వాత క్రమంగా ఏడుపు...

తర్వాత ఉక్రోషం...

తర్వాత కోపం...

ఒకదాని వెంట ఒకటి పోటు చేసుకున్నాయి. ఇప్పుడు రాంబాబుకి తల్లిదండ్రులంటే అసహ్యమేస్తోంది చెప్పలేనంత. * * * * *

ఆరోజు అర్ధరాత్రి మెలుకువ వచ్చింది రాంబాబుకి. తల్లి తండ్రి చేతులు వాడిమీద పెట్టి నిద్రపోతున్నారు.

ఒక్కసారి కంపరమెత్తింది. రాంబాబుకి. ఇద్దరి చేతులు తొలగించి మెల్లగా వేరే గదిలోకి వెళ్ళి పడు కున్నాడు. ౦

ఇప్పుడు రాంబాబు ఏం చేయాలి? ఈ కథకు తగిన ముగింపు సూచించిన ముగ్గురు పాఠకులకు మూడు డాక్టర్ కొమ్మూరి వేణు గోపాలరావు 'నెత్తుటిబొట్టు' నవల కాపీలు రచయిత ఆటోగ్రాఫ్‌తో బహూకరిస్తారు.

-ఎడిటర్